సాక్షి
జగిత్యాల

ఆదివారం । 26 । మార్చి । 2023



కొండపై జడ్జిల పూజలు

కొండగట్టు : హైకోర్టు జడ్జి జస్టిస్ ఈవీ వేణు గోపాల్, జస్టిస్ కె.లలిత శనివారం శ్రీ ఆంజేయస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.



విరిగిపడ్డ చింతచెట్టు

కథలాపూర్ : ఈదురు గాలులతో కూడిన భారీవర్షం కురవడంతో కలిగోటలోని 200 ఏళ్లనాటి చింతచెట్టు దర్గాపై విరిగిపడింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

రంజాన్ వేళలు

పవిత్రమైన రంజాన్ రోజులు శాంతి సందేశం అందించాలి. ప్రపంచ శాంతికి దోహదం చెయ్యాలి.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
ఆది 6.32	సోమ 4.51

న్యూస్‌రీల్

కోర్టు భవన నిర్మాణానికి చీఫ్ జస్టిస్ శంకుస్థాపన



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్

కోరుట్ల: పెద్దగుండు సమీపంలోని కోర్టు భవన నిర్మాణానికి హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ శనివారం శంకుస్థాపన చేశారు. రూ.2 కోట్ల అంచనా వ్యయంతో భవన నిర్మాణం చేపట్టారు. శిలాఫలకం ఆవిష్కరించిన అనంతరం ప్రధాన న్యాయమూర్తి అక్కడ మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు జస్టిస్ నవీన్‌రావు, జస్టిస్ జువ్వాడి శ్రీదేవి, జగిత్యాల పోర్టు పోలియో జడ్జి జస్టిస్ అనుపమ చక్రవర్తి, జస్టిస్ ఎ.సంతోష్‌రెడ్డి, జస్టిస్‌పుల్లా కార్తీక్, జగిత్యాల జిల్లా జడ్జి నీలిమ, కలెక్టర్ యాస్మిన్ బాషా, ఎస్పీ భాస్కర్, కోరుట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపతిరావు, ప్రధాన కార్యదర్శి రాజేశ్ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటం బహూకరణ

కాగా, సీనియర్ న్యాయవాది చాప కిశోర్ గీసిన హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చిత్రపటాన్ని ప్రధాన న్యాయమూర్తికి బహూకరించారు. కిశోర్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో పాటు జడ్జిలు తదితరులు అభినందించారు.

విద్యారంగం పటిష్టతకు కృషి



సర్టిఫికెట్లు అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాలజోన్: విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వం కృషి చేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం అమలు అండర్ టేకింగ్ సర్టిఫికెట్లను ప్రధానోపాధ్యాయులకు ఆమె తన కార్యాలయంలో శనివారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. జెడ్పీ సీఈవో రామానుజాచార్యులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, తమకు వేతనాలు పెంచినందుకు సెర్ప్ ఉద్యోగులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలుసుకుని కృతజ్ఞతలు తెలిపారు.

తొలగిన ఇబ్బందులు




డీఈవోకు మిఠాయి తినిపిస్తున్న నాయకులు

జగిత్యాల: జగిత్యాలలో పదో తరగతి మూల్యాంకన కేంద్రం ఏర్పాటు కావడంతో ఉపాధ్యాయులకు ఇబ్బందులు తొలగినట్లయ్యాయని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆర్‌యూపీపీటీ నాయకులు డీఈవోను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు చందనారాయణ, నరేందర్, రాజేందర్, రాజేశం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యాయామంతో ఆరోగ్యం

నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని డీఈవో జగన్మోహన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రావిటి స్కూల్‌లో చేపట్టిన వ్యాయామ ఉపాధ్యాయుల యోగా శిక్షణ తరగతులు ముగిశాయి. ఈసందర్భంగా డీఈవో జగన్మోహన్‌రెడ్డి మాట్లాడారు.

జాతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక



సాయిచరణ్, ఆదిత్య

మల్యాల(చొప్పదండి): రామన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు గడ్డం సాయిచరణ్, కొండబత్తిని ఆదిత్య జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజగోవిందరెడ్డి, పీఈటీ విద్యాసాగర్ శనివారం తెలిపారు. ఈనెల 28 – 30వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే పోటీలకు వీరు హాజరవుతారన్నారు. విద్యార్థులు పలువురు అభినందించారు.





ఇడ్లీవడ.. దోశ!

Sunday Special

- మార్నింగ్ టిఫిన్ బయటనే..
- మారుతున్న ఉమ్మడి జిల్లావాసుల అభిరుచి
- పట్టణాల్లో పెరుగుతున్న టిఫిన్ సెంటర్లు
- కరీంనగర్‌లో ఇడ్లీ వడ.. సిరిసిల్లలో పూరి..
- జగిత్యాల, పెద్దపల్లిలో దోశ ఫేవరెట్ ఫుడ్
- మిల్లెట్‌ఫుడ్‌కు పెరుగుతున్న డిమాండ్

'రాజేశ్ కరీంనగర్ నగరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తుంటాడు. నిత్యం ఉదయం తొమ్మిది గంటలకే విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. 20 కిలోమీటర్ల దూరంలో ఉండే ఇంటి నుంచి ఉదయం ఎనిమిది గంటలకే లంచ్ బాక్స్‌తో సహా వచ్చేస్తాడు. మధ్యాహ్నం వరకు ఆకలికి ఆగడం కష్టమని పాఠశాలకు సమీపంలో ఉన్న ఓ టిఫిన్ సెంటర్‌లో రోజూ అల్పాహారం చేసి వెళ్తుంటాడు. రాజేశ్ ఒక్కడే కాదు.. ఇలా ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా 40 వేలకు పైగా మంది పొద్దున్నే టిఫిన్ సెంటర్లలో కడుపు నింపుకుంటున్నారు'.

'కరీంనగర్‌లో నివాసం ఉంటున్న మహేందర్ ఫ్యామిలీతో పొద్దున్నే ఊరెళ్లాలి. దూర ప్రయాణం చేయాల్సి ఉంది. తినేందుకు ఇంట్లో టిఫిన్ తయారు చేయాలంటే ఆలస్యం అవుతుంది. దీంతో ఉదయాన్నే టిఫిన్ సెంటర్‌కు వెళ్లాడు. రెండుమూడు రకాల టిఫిన్లు పార్శిల్ తీసుకున్నాడు. అరగంటలో టిఫిన్ తిని బస్టాండ్‌కు పిల్లలతో సహా బయల్దేరారు. ఒక్క మహేందరే కాదు.. ఉమ్మడి జిల్లా పరిధిలో ఇలా రోజూ పది వేల మందికి పైగా టిఫిన్లు హోటళ్ల నుంచి పార్శిల్స్ తీసుకెళ్తున్నారు.'

జీవనయానంలో ఉరుకులు.. పరుగులు సాధారణమైపోయాయి. సమయంతో పోటీపడుతూ.. అంతా రెడీమేడ్ అన్నట్లు తయారైంది. పొద్దున్నే లేవడం.. రెడీ కావడం.. విధులకు బయల్దేరడం.. దారిలో ఇంత టిఫిన్ చేయడం కాలచక్రంలో భాగమైపోయింది. ఈ క్రమంలో టిఫిన్ సెంటర్లకు ఇప్పుడు మంచి డిమాండ్ ఏర్పడింది. టిఫిన్ సెంటర్లకు వెళ్లడం.. నచ్చింది కడుపునిండా తినడం పనులకు వెళ్లడం అలవాటైపోయింది. ఇందులో ఉమ్మడి జిల్లావాసులు భిన్నరుచులు ఇష్టపడుతున్నారు. కరీంనగర్ జిల్లావాసులు ఎక్కువగా ఇడ్లీ-వడ కాంబినేషన్‌ను ఇష్టపడుతుండగా.. రాజన్న సిరిసిల్ల జిల్లావాసులు పూరి ఎక్కువగా తింటున్నారు. ఇక జగిత్యాల.. పెద్దపల్లిలో దోశ అంటే మక్కువని చెబుతున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పొద్దున్నే ఘుమఘుమలాడే అల్పాహార రుచులు.. జిల్లావాసుల అభిరుచులపై సండే స్పెషల్..!! - సాక్షి, కరీంనగర్ డెస్క్

అడుగుకో టిఫిన్ సెంటర్..

ఇప్పుడు పరిస్థితి కరోనా ముందు.. కరోనా తరువాత అన్నట్లు తయారైంది. కరోనా తరువాత ఆహార సంబంధ వ్యాపారాలు ఉమ్మడి జిల్లాలో చాలా బాగా నడుస్తున్నాయని పలువురు చెబుతున్నారు. గతంలో పట్టణాల్లో వాడకో రెండు టిఫిన్ సెంటర్లు ఉండగా.. ఇప్పుడు కనుచూపుమేరలోనే రెండు మూడు దర్శనమిస్తున్నాయి. చిన్నతోపుడు బండి నుంచి మొదలుపెడితే.. పెద్దపెద్ద అద్దాల భవనాలలోనూ టిఫిన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో ఒక్కోచోట ఒక్కో ప్రత్యేకమైన టిఫిన్‌ను తయారు చేస్తూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. టిఫిన్ సెంటర్లను బట్టి రూ.20 నుంచి రూ.70 వరకు ధరలు ఉంటున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో చిన్నాపెద్ద కలిపి 250 వరకు టిఫిన్ సెంటర్లు ఉండగా.. పెద్దపల్లి జిల్లాలో 120, జగిత్యాలలో 180, సిరిసిల్లలో 200కు పైగా ఉన్నట్లు అంచనా. వీటితో పాటు మిల్లెట్ ఇడ్లీలు, మిల్లెట్ దోశలు ప్రస్తుతం పలు టిఫిన్ సెంటర్లలో ప్రత్యేకం.

జిల్లాలవారీగా 100 మంది చొప్పున పొద్దున ఏయే టిఫిన్లు తింటారని సర్వే చేయగా.. వెల్లడైన అంశాలివి..








	కరీంనగర్	రాజన్న సిరిసిల్ల	జగిత్యాల జిల్లా..	పెద్దపల్లి జిల్లా
ఇడ్లీ, వడ	40	20	15	15
దోశ	25	25	30	30
పూరి	10	30	25	25
ఇడ్లీ	10	10	13	10
బోండ	10	15	17	15
ఊతప్ప	05			05

ఉద్యోగులు.. యువతే

పొద్దున్నే బయట టిఫిన్ చేసేవాళ్లలో ఎక్కువగా ప్రయివేటు ఉద్యోగులు, యువతే ఉన్నట్లు తెలుస్తోంది. వీరి తరువాత పట్టణాలకు పని నిమిత్తం వచ్చేవారు.. పట్టణాల్లో నివాసం ఉండేవారు, కాలేజీ యువత ఆసక్తి చూపుతున్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కమాన్, మంకమ్మతోట, జగిత్యాల రోడ్డు, మంచిర్యాల చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు ప్రాంతంతోపాటు విమల్ టాకీస్ ఏరియా, మార్కెట్ ఏరియా, వేములవాడలో గుడి పరిసరాల్లో, జగిత్యాలలో మార్కెట్ ఏరియా, బస్టాండు ప్రాంతంలోని టిఫిన్ సెంటర్లలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. పెద్దపల్లిలో జెండాగద్దె, బస్టాండు, గోదావరిఖని ప్రధాన చౌరస్తా ప్రాంతాల్లోని టిఫిన్ సెంటర్లలో రద్దీగా ఉంటుంది.

నైట్ టిఫిన్ సెంటర్లు



కరీంనగర్ జిల్లాకేంద్రంతో పాటు మిగితా ప్రాంతాల్లోనూ నైట్ టిఫిన్ సెంటర్లు పోటాపోటీగా వెలుస్తున్నాయి. కమాన్, బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, జగిత్యాలరోడ్డులో నైట్ టిఫిన్ సెంటర్ల వద్ద రద్దీ కనిపిస్తుంది. హైవేల వెంట మొబైల్ టిఫిన్ సెంటర్లు నోరూరిస్తున్నాయి. ఉదయం, సాయంత్రం అందుబాటులో ఉంటున్నాయి.

ఇడ్లీవడ ఎక్కువగా..



నేను ఆటో డ్రైవర్‌ను. పొద్దున ఏడు గంటలకే ఇంట్లోంచి బయటికి వెళ్తా. అప్పటికి ఇంట్లో ఏం టిఫిన్ సిద్ధం చేయరు. దీంతో మా అడ్డాకి సమీపంలో కానీ.. అందుబాటులో ఉన్నచోట రోజూ టిఫిన్ చేస్తా. వారంలో మూడు, నాలుగు సార్లు ఇడ్లీవడ కాంబినేషన్ తింటా. అది తింటే త్వరగా జీర్ణమవుతుందని నా అభిప్రాయం.

– రాజు, ఆటో డ్రైవర్, కరీంనగర్

ఆరోగ్యం ముఖ్యం



ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. ప్రస్తుతం ఏదైనా కల్తీగా మారుతోంది. నేను అడ్వోకేట్‌ను. పొద్దున లేస్తే చాలా బిజీగా ఉంటాను. అలా అని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయను. ఇదివరకు సాధారణ టిఫిన్లు తినేవాన్ని. ఇప్పుడు పెద్దపల్లిలో మిల్లెట్ టిఫిన్స్ అందుబాటులోకి వచ్చాయి. దీంతో నేను ప్రతీరోజు మిల్లెట్ ఇడ్లీ లేకుంటే మిల్లెట్ దోశ తింటూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నా.

– వీ.ఎస్.మూర్తి, అడ్వోకేట్, పెద్దపల్లి

20 ఏళ్ల నుంచి ఈ వ్యాపారమే..



సిరిసిల్లలో 20 ఏళ్ల నుంచి టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నా. మా ఫ్యామిలీతో పాటు 20మందికి ఉపాధి కల్పిస్తున్నా. మా హోటల్‌లో పరోటా ఫేమస్. రోజూ బాగానే గిరాకీ ఉంటుంది. ఇతర ప్రాంతాల వారు కూడా సిరిసిల్లకు వచ్చినప్పుడు ఇక్కడే తింటారు.

– శ్రీనివాస్, టిఫిన్‌సెంటర్ యజమాని, సిరిసిల్ల

ఉదయం, సాయంత్రం గిరాకీ



కరీంనగర్‌లో మాది పేరున్న టిఫిన్ సెంటర్. ఉదయం సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం 12 వరకు, మళ్లీ 3గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు గిరాకీ ఉంటుంది. ఉదయం ఊతప్ప, సాయంత్రం దోశ మా టిఫిన్ సెంటర్ ప్రత్యేకం. – ప్రసాద్, టిఫిన్ సెంటర్ నిర్వాహకుడు, కరీంనగర్

మహిళకు ఆరోగ్య భాగ్యమే..!

- వ్యాధుల గుర్తింపు.. చికిత్సకు కార్యాచరణ
- ప్రతి మంగళవారం ప్రత్యేక సేవలు
- ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు
- ఆరోగ్య మహిళకు భారీ స్పందన



ఆరోగ్య మహిళా సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య మహిళ వివరాలు

సమాచారం	కరీంనగర్	సిరిసిల్ల	జగిత్యాల	పెద్దపల్లి
ఆసుపత్రులు	03	04	05	03
చూసిన ఓపీ	414	201	501	164
చేసినపరీక్షలు	260	60	253	47

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ మహిళల ఆరోగ్యం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8న ప్రత్యేక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆరోగ్య మహిళ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 100 ఆస్పత్రులను ప్రారంభించింది. ఇందులో అన్ని వయసుల మహిళలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నారు. వారికి వైద్య సేవల కోసం ప్రతి మంగళవారం ప్రత్యేకంగా క్లినిక్‌లను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఎనీమియా, క్యాన్సర్ నిర్ధారణ, పౌష్టికాహార లోపాన్ని గుర్తించడం, మూత్రాశయ సంబంధిత ఇన్‌ఫెక్షన్లు, మెనోపాజ్ సమస్యలు, లైంగిక సంబంధ వ్యాధులు, గర్భాశయ కణతులు, ఆర్థో, బరువుకు సంబంధించిన ఇబ్బందులు ఇలా ఒక్కో నెలలో ఒక్కో సమస్యపై కార్యక్రమం తీసుకుని వైద్య సేవలు అందిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులు

ఆరోగ్య మహిళ నిర్వహణ కోసం ఉమ్మడి జిల్లాలో 15 ఆసుపత్రులను ఎంపిక చేసి సేవలు కొనసాగిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో 3 ఆసుపత్రులు.. నగరంలోని బుట్టిరాజారాం కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 4 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని సుందరయ్యనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, వేములవాడ, తంగళ్లపల్లి, నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జగిత్యాల జిల్లాలో 5 ఆసుపత్రులు.. ఇందులో పట్టణంలోని జేఎస్ రాంవెల్ పట్టణ ఆరోగ్య కేంద్రం, కొడిమ్యాల, నేరెళ్ల, అయిలాపూర్, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పెద్దపల్లి జిల్లాలో 3 ఆసుపత్రులు.. ఇందులో పెద్దపల్లి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రామగుండం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మంథనిలో గద్దెలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆరోగ్య మహిళ ఆసుపత్రులుగా మార్చారు. మిగతా సేవలకు ఇబ్బంది కలగకుండా ప్రతి మంగళవారం మాత్రం కేవలం మహిళల కోసమే ఆసుపత్రులను నిర్వహిస్తున్నారు.మహిళా వైద్యులు, సిబ్బందిని నియామకం చేశారు. అవసరమయ్యే పరికరాలను సమకూర్చారు.

మేజర్ సమస్య ఉంటే పెద్దాసుపత్రికి..

మహిళలకు సాధారణ సమస్యలు ఉంటే ఆరోగ్య కేంద్రంలోనే చికిత్స అందిస్తున్న వైద్యులు, మేజర్ ఆరోగ్య సమస్యలు ఉంటే పెద్దాసుపత్రికి రెఫర్ చేస్తున్నారు. క్యాన్సర్, గర్భాశయ సమస్యలు నిర్ధారణ అయిన వారిని సంబంధిత ఆసుపత్రులకు పంపించి చికిత్స అందేలా చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ఈనెల 8 నుంచి ఇప్పటివరకు 3 మంగళవారాలు ఎంపిక చేసిన ఆసుపత్రులలో వైద్య సేవలు అందించారు. ఆరోగ్య మహిళకు ఎంపిక చేసిన ఉమ్మడి జిల్లాలోని 15 ఆసుపత్రులలో ఇప్పటివరకు 1280 మందికి ఓపీ సేవలు అందించారు. ఇందులో 620 మందికి అవసరమైన పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు.

మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యం

జగిత్యాల: మిల్లెట్స్‌తో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. పోషణ్ పక్వాడాలో భాగంగా స్థానిక కేజీబీవీ విద్యార్థులకు శనివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రధానంగా మిల్లెట్స్‌లో అధిక పోషక విలువలు ఉంటాయని, వాటిని తీసుకుంటే మంచిదని అన్నారు. ప్రతీరోజు మిల్లెట్స్ తీసుకోవడం ద్వారా బాలికల్లో రక్తహీనత ఉండదని, ఐరన్, విటమిన్స్ లోపం ఏర్పడదని అన్నారు. సీడీపీవో వీరలక్ష్మి, డాక్టర్ చైతన్యరాణి, కౌన్సిలర్ రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ మధులత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంక్షేమాధికారి నరేశ్

జేపీసీకి జంకుతున్న కేంద్రప్రభుత్వం



జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తాలో బైఠాయించి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ శ్రేణులు

- దేశ ప్రతిష్టను కాపాడడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం
- ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో ధర్నా
- కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

జగిత్యాలటౌన్: బ్యాంకులను కొల్లగొట్టిన లలిత్‌మోదీ, నీరవ్‌మోదీలను భారత్‌కు రప్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని, అదానీ వ్యవహారంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ(జేపీసీ) వేయడానికి జంకుతోందని ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి విమర్శించారు. భారతదేశ ప్రతిష్టను నిలబెట్టేందుకు, ఆర్థిక నేరస్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు కాంగ్రెస్ ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉందన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వ రద్దును నిరసిస్తూ స్థానిక తహసీల్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణులు శనివారం ధర్నా చేశారు. రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కుట్రతోనే రాహుల్‌గాంధీ సభ్యత్వం రద్దు చేశారని ఆరోపించారు. మోదీ ఇంటిపేరు గల వ్యక్తులు దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారన్న రాహుల్ వ్యాఖ్యలపై ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారో అర్థంకావడంలేదన్నారు. నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ ఆర్థిక నేరస్తులు కాదా? అని ప్రశ్నించారు. నీరవ్‌మోదీ, లలిత్‌మోదీ, అదానీల వ్యవహారాల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దు కుట్రకు తెరతీశారని ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలిచ్చిన కేంద్రప్రభుత్వం.. దేశ సంపదను అదానీకి దోచిపెడుతోందని, ప్రశ్నించే వారిపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ సభ్యత్వ రద్దు ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టులాంటిదన్నారు. రోడ్లు, విమానశ్రయాలు, ఓడరేవులు, బొగ్గు గనులు ఒకేవ్యక్తికి కట్టబెడుతూ దేశసంపద కొల్లగొడుతుంటే ప్రశ్నించడం నేరమెలా అవుతుందని నిలదీశారు. దేశ ప్రజలంతా రాహుల్‌గాంధీ వెంట ఉన్నారని, నిరంకుశ పాలన సాగిస్తున్న కేంద్రప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, నాయకులు గిరి నాగభూషణం, కొత్త మోహన్, కల్లెపెల్లి దుర్గయ్య, బండ శంకర్, గాజుల రాజేందర్, పుప్పాల అశోక్, గుండ మధు, ముంజాల రఘువీర్, చందా రాధాకిషన్, నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నృసింహుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



పూజలో హైకోర్టు న్యాయమూర్తి దంపతులు

ధర్మపురి : ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి సన్నిధిలో శనివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌.వి. శ్రావణ్‌కుమార్‌ దంపతులు స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా పూర్ణకుంభం, మేళతాళాలతో స్వాగతం పలికారు. లక్ష్మీ నృసింహ స్వామి ప్రధాన ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్‌, రేనవేషన్‌ కమిటీ సభ్యులు రామన్న, వేదపండితులు బొజ్జ రమేశ్‌ శర్మ, ముత్యాల శర్మ, కమిటీ సభ్యులు తదితరులున్నారు.

డీసీఆర్బీ సీఐగా శ్రీనివాస్‌

జగిత్యాలక్రైం: జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో డీసీఆర్బీ సీఐగా ఎ.శ్రీనివాస్‌ను నియమిస్తూ మల్టీజోన్‌ ఐజీ చంద్రశేఖర్‌ రెడ్డి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. గతంలో జగిత్యాల ఎస్బీ సీఐగా పనిచేసి ఐజీ కార్యాలయానికి అటాచ్‌గా వెళ్లిన శ్రీనివాస్‌ను కొద్ది కాలం అనంతరం జగిత్యాల డీసీఆర్బీ సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాస్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నాసిరకం ప్రసాదం తయారీపై ఆగ్రహం

కొండగట్టు(చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారి ఆలయంలో నాణ్యత పాటించకుండా ప్రసాదాలు తయారు చేస్తున్నారని ఓ భక్తుడు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. శనివారం స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంచిర్యాల జిల్లా దండెపల్లి మండలానికి చెందిన ఓ భక్తుడు పోలీసులకు మాజీ ట్రస్టు బోర్డు సభ్యులకు విషయాన్ని తెలిపాడు. సెక్యూరిటీ గేట్‌ వద్ద నాసిరకం పులిహోర ప్యాకెట్లను చూపిస్తూ ఎవరు కొనుగోలు చేయవద్దన్నారు. వెంటనే ఆలయ అధికారులు స్పందించి నాణ్యమైన ప్రసాదం తయారుచేసి విక్రయించాలని సూచించారు.

భరణి నక్షత్ర వేడుకలు



పూజలు చేస్తున్న వేదపండితులు

ధర్మపురి: శ్రీలక్ష్మీనృసింహస్వామి అనుబంధ శ్రీయమధర్మరాజు ఆలయంలో శనివారం భరణి నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ముత్యాలశర్మ మంత్రోచ్చారణలతో రుద్రాభిషేకం, మన్యసూక్తం, ఆయుష్యసూక్తంతో అభిషేకం చేశారు. అనంతరం హోమ, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం సూపరింటెండెంట్‌ కిరణ్‌, సిబ్బంది పాల్గొన్నారు.

50 ట్రిప్పుల ఇసుక డంప్‌ సీజ్‌

వేములవాడ/వేములవాడరూరల్‌: మండలంలోని జయవరం వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 50 ట్రిప్పుల ఇసుకను సీజ్‌ చేసినట్లు టౌన్‌ సీఐ వెంకటేశ్‌ శనివారం తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేసినా, నిర్మాణాలు లేకున్నా ఇసుక డంప్‌లను ఏర్పాటు చేసినా సీజ్‌ చేస్తామని పేర్కొన్నారు.

సైబర్‌ నేరాలపై అలర్ట్‌

- బాధితులు ఫిర్యాదు చేస్తే రికవరీకీ చాన్స్‌
- సైబర్‌ నేరాలను అరికట్టేందుకు
- పోలీసుల ప్రత్యేక చర్యలు



సైబర్‌ నేరగాళ్లు

జగిత్యాల క్రైం: సాంకేతిక రంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నా.. సైబర్‌ నేరగాళ్ల వలలో పడి ఎంతోమంది చిక్కుకుపోతున్నారు. పలు ఆర్థిక లావాదేవీలపై కన్నేసి సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారు. దీంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. సైబర్‌ నేరాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

జనవరి నుంచి 143 సైబర్‌ నేరాలు..

జగిత్యాల జిల్లాలో 2022లో 635 సైబర్‌ నేరాలు జరగగా అందులో బాధితులు రూ.2,77,25,139లను కోల్పోయారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సైబర్‌ నేరగాళ్ల ఖాతాలను గుర్తించి రూ.17,17,299 రికవరీ చేశారు. జనవరి నుంచి ఇప్పటివరకు 143 కేసుల్లో రూ.86,45,339 కోల్పోగా పోలీసులు రూ.9,90,332 రికవరీ చేశారు.

ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ నెంబర్‌..

బాధితులు సైబర్‌ నేరాలకు గురైతే వెంటనే 1930, డయల్‌ 100 ఫోన్‌ చేస్తే పోలీసులు డబ్బును రికవరీ చేసే అవకాశం ఉంటుంది. ఆర్థిక లావాదేవీలను నిలిపివేసి బాధితులకు న్యాయం చేస్తారు.

ఆర్థికపరమైన సైబర్‌ నేరాలు..

రాష్ట్రవ్యాప్తంగా సైబర్‌ నేరస్తులు పెద్దఎత్తున ఆర్థికపరమైన సైబర్‌ నేరాలకు పాల్పడుతున్నారు. క్రెడిట్‌, డెబిట్‌ కార్డులతో పాటు ఓటీపీ ఫ్రాడింగ్‌ కేసులే ఎక్కువగా జరుగుతున్నాయి. బ్యాంక్‌ నుంచి ఫోన్‌ చేస్తున్నామని, లక్కీ లాటరీ గెలుచుకున్నారని, సెల్‌ఫోన్‌ నెంబర్‌కు వచ్చే ఓటీపీ చెప్పడంతో సైబర్‌ నేరస్తులు తమ ఖాతాల్లోని డబ్బును మళ్లించుకుంటున్నారు. ఫేస్‌బుక్‌లో ప్రొఫైల్‌ ఫొటో మార్చి స్నేహితులు, కస్టమర్ల నుంచి అత్యవసరంగా డబ్బు అవసరముందని రిక్వెస్టులు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నారు. కొంతమంది వినియోగదారులకు క్యాష్‌బ్యాక్‌ లేదా రుణాలు అందజేస్తామని యాప్‌లు డౌన్‌లోడ్‌ చేసుకోవాలని మోసాలకు పాల్పడుతున్నారు.

జిల్లాలో సైబర్‌ కేసులు	
2022	635
2023	143

యాప్‌ల ద్వారా..

సాంకేతిక రంగంలో ప్రతి ఒక్కరికీ సెల్‌ఫోన్‌ వాడకం పెరగడంతో వారికున్న బ్యాంకు ఖాతాలను వ్యక్తిగత సమాచారాన్ని సెల్‌ఫోన్‌లోనే భద్రపర్చుకుంటారు. దీంతో సెల్‌ఫోన్లకు యాప్‌లు పంపించి డౌన్‌లోడ్‌ చేసుకుంటే క్యాష్‌బ్యాక్‌ వస్తుందని నమ్మించి యాప్‌ డౌన్‌లోడ్‌ కాగానే వారి వ్యక్తిగత వివరాలను సైబర్‌ నేరగాళ్లు తీసుకుని మోసాలకు తెరలేపుతున్నారు.

సైబర్‌ నేరాలపై విస్తృత అవగాహన

రాష్ట్రవ్యాప్తంగా సైబర్‌ నేరాలు ఎక్కువగా జరుగుతుండటంతో ప్రభుత్వం, పోలీసు శాఖ సైబర్‌ నేరాలను అరికట్టేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో, పాఠశాలలు, కళాశాలలతో పాటు, గ్రామాల్లో, పట్టణాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి సైబర్‌నేరాలు జరుగుతున్న తీరు, వాటిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే సత్వరమే డబ్బును రికవరీ చేయడంతో పాటు సైబర్‌ నేరగాళ్లను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు.

సత్వరమే ఫిర్యాదు చేయాలి



జిల్లాలో సైబర్‌ నేరాలకు గురైన బాధితులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబర్‌ 1930 డయల్‌ 100 కు సత్వరమే ఫిర్యాదు చేస్తే పోలీసు శాఖ సైబర్‌ నేరగాళ్ల బ్యాంక్‌ ఖాతాను నిలిపివేసి డబ్బు రికవరీ చేసే అవకాశం ఉంటుంది. బాధితులు ఎలాంటి భయాందోళన లేకుండా నేరుగా ఫిర్యాదు చేయాలి. అగంతకుల ఫోన్‌ కాల్స్‌, మెసేజ్‌లు, లింక్‌లు ఓపెన్‌ చేసి ఇబ్బందులకు గురికావద్దు. – భాస్కర్‌, ఎస్పీ

ఇంటింటా ఇంకుడుగుంత నిర్మించుకోవాలి



ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

జగిత్యాలరూరల్‌: జిల్లాలోని ప్రతీ మహిళా సంఘ సభ్యురాలు తమ ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకోవాలని డీఎంలు మల్లేశం, వనజ సూచించారు. స్థానిక సెర్ప్‌ కార్యాలయంలో జగిత్యాల రూరల్‌, అర్బన్‌ మండలాల మహిళా సమాఖ్యల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ, మహిళా సంఘ సభ్యులు ఇంటికో ఇంకుడుగుంత నిర్మించుకోవడంతోపాటు గ్రామస్తులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. క్లస్టర్‌స్థాయిలో సెర్ప్‌ సీసీలు, ఉపాధిహామీ టీఏలు కలిసి ప్రజలు ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా చూడాలని చెప్పారు. ఇంకుడుగుంత నిర్మించుకుంటే రుణాలు అందిస్తామనే విషయాన్ని వీఏవోలు ప్రచారం చేయాలని చెప్పారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని, ఇందుకోసం గ్రామ సంఘం సభ్యులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాల ప్రగతి సాధించాలని అన్నారు. అనంతరం మహిళా సంఘం కార్యాలయ ఆవరణలో పోషణ్‌ పక్వాడా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ఫెసిలిటేటర్‌ హరిని, ఏపీఎం గంగాధర్‌, సీసీలు గంగారాం, రవీందర్‌, సాగర్‌, సంతోష్‌, అధ్యక్షురాలు భవాని, కార్యదర్శి సునీత పాల్గొన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్‌ మండలం ధరూర్‌ గ్రామానికి చెందిన కొత్తపల్లి రాయమల్లు (70) శనివారం పురుగు ల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నా డు. గ్రామానికి చెందిన కొత్తపల్లి రాయమల్లు అనారోగ్యంతో బాధపడుతున్నా డు. జీవితంపై విరక్తి చెంది పురుగుల మందుతాగగా కుటుంబ సభ్యులు జగి త్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. మృతుడి భార్య లచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్‌ ఎస్సై అనిల్‌ తెలిపారు.

దాడిచేసిన ముగ్గురిపై కేసు

జగిత్యాల క్రైం: జగిత్యాల అర్బన్‌ మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన కొల్లూరి భూమయ్యపై దాడిచేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్‌ ఎస్సై అనిల్‌ తెలిపారు. గ్రామానికి చెందిన కొల్లూరి భూమయ్యకు అతని సోదరుల మధ్య కొంతకాలంగా భూ వివాదం నడుస్తోంది. పాత పగలను దృష్టిలో ఉంచుకుని శుక్రవారం రాత్రి అతని అన్న కుమారులు కొల్లూరి శంకర్‌, కొల్లూరి రాజశేఖర్‌, అలాగే సోదరుడు కొల్లూరి రాజన్న భూమయ్యపై కర్రతో దాడిచేశారు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

జగిత్యాల క్రైం: మహిళ మెడలోంచి ఇద్దరు గొలుసును లాక్కెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌కు చెందిన రంగు లలిత శుక్రవారం రాత్రి సాయిబాబా ఆలయ సమీపంలోని బైపాస్‌ రోడ్డువైపు నడుచుకుంటూ వెళ్తుంది. మల్యాల మండలం నూకపల్లి హౌసింగ్‌ కాలనీకి చెందిన మహ్మద్‌ హకీం, పోటె భీంరావు ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోంచి బంగారు గొలుసు లాక్కెళ్లారు. వెంటనే స్థానికులు వారిని పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. కాగా వీరు 15రోజుల క్రితం మాతాశిశు కేంద్రం ఆస్పత్రి వద్ద దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు నిర్ధారించారు. లలిత ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ కిశోర్‌ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని లడ్డూఖాజా ప్రాంతానికి చెందిన గొగికార్‌ బాపురావు (45) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. బాపురావు ఈనెల 11న వాణినగర్‌లో డిష్‌వైర్‌ మరమ్మతు చేస్తుండగా విద్యుత్‌షాక్‌ తగిలింది. దీంతో కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య శోభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్‌ తెలిపారు.

రెండు ద్విచక్రవాహనాలు చోరీ

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని వాణినగర్‌కు చెందిన ఆరుముల్ల గణేశ్‌, వెంకటాద్రినగర్‌కు చెందిన అన్నాటి భాస్కర్‌కు చెందిన రెండు ద్విచక్రవాహనాలను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు చేసినట్లు పట్టణ సీఐ కిశోర్‌ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వాణినగర్‌కు చెందిన గణేశ్‌ ఈనెల 1న మధ్యాహ్నం వాణి థియేటర్‌ వద్ద తన ద్విచక్రవాహనాన్ని పార్కింగ్‌ చేశాడు. తిరిగి వచ్చేసరికి బైక్‌ కనిపించలేదు. వెంకటాద్రినగర్‌కు చెందిన పన్నాటి భాస్కర్‌ ఈనెల 3న అంగడిబజార్‌లో తన బైక్‌ను పార్కింగ్‌ చేశాడు. మార్కెట్‌లో సామగ్రి కొనుగోలు చేసి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఇద్దరు శనివారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

విద్యార్థులపై తేనెటీగల దాడి



తేనెటీగల దాడిలో గాయపడిన టీచర్‌

కోరుట్ల రూరల్‌ : మండలంలోని వెంకటాపూర్‌ శివారులోని వేంకటేశ్వర ఆలయ ఆవరణలో శనివారం విద్యార్థులపై తేనెటీగలు దాడిచేశాయి. ఈ ఘటనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే మెట్‌పల్లి పట్టణానికి చెందిన మాతృ శ్రీ ప్రైవేట్‌ హై స్కూల్‌కు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు వెంకటాపూర్‌ గుట్ట వద్దకు పిక్‌నిక్‌ కోసం వెళ్లారు. కాగా మర్రి చెట్టుకింద విడిదిచేయగా ఒక్కసారిగా తేనెటీగలు లేచి విద్యార్థులు, ఉపాధ్యాయులపై దాడిచేశాయి. మామెడ సరిత అనే టీచర్‌ను 108 అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గోదావరిలో నీటమునిగి ఒకరి మృతి

ధర్మపురి : గోదావరిలో స్నానానికి వెళ్లిన ఓ భక్తుడు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందినట్లు హెడ్‌కానిస్టేబల్‌ సలీం తెలిపారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం.. చింతగూడ గ్రామానికి చెందిన చిలివేరు సత్తన్న (55) శనివారం ఆరెపెల్లి వద్ద స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగి మృతిచెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపాడు.

పరిమితికి మించి ప్రయణికులను తరలిస్తే చర్యలు

వేములవాడ రూరల్‌: వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని వేములవాడ రూరల్‌ ఎస్సై నాగరాజు అన్నారు. శనివారం వేములవాడ మండలంలోని నాగాయపల్లి గ్రామం వద్ద విద్యార్థులను పరిమితికి మించి తరలిస్తూ ప్రమాదానికి కారకుడైన ఆటో డ్రైవర్‌ లక్ష్మీ నారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

మండలాల ప్రత్యేకాధికారులు వీరే



ఏపీడీ బాలే శివాజీ

ఇబ్రహీంపట్నం: జిల్లాల్లోని మండలాలకు ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్‌ షేక్‌ యాస్మిన్‌ బాషా ఉత్తర్వులు జారీచేశారు. ఇబ్రహీంపట్నం – డీఆర్‌డీఏ ఏపీడీ బాలే శివాజీ. బీర్పూర్‌–డీఆర్డీఏ ఏపీడీ సి.సుధీర్‌. బుగ్గారం – డీఎంవో డి. ప్రకాశ్‌, ధర్మపురి – ఏడీ, ఎస్సీ కార్పొరేషన్‌ అధికారి కె. లక్ష్మీనారాయణ, గొల్లపెల్లి – డీబీసీడీవో ఎల్‌.సాయిబాబా. జగిత్యాల రూలర్‌– ఈఈ ఇరిగేషన్‌ డివిజన్‌ నంబర్‌ 3 అధికారి అబ్జల్‌ హుస్సేన్‌ ఖాన్‌, జగిత్యాల – డీఎస్‌సీడీవో జగిత్యాల కె. రాజ్‌కుమార్‌, కథలాపూర్‌ – డీఎఫ్‌వో బి.వెంకటేశ్వర్‌రావు, కొడిమ్యాల – డీహెచ్‌అండ్‌ఎస్‌వో జె. ప్రతాప్‌ సింగ్‌, కోరుట్ల – డిస్ట్రిక్ట్‌ ఫిషరీస్‌ ఆఫీసర్‌ ఎల్‌. దామోదర్‌, మల్లాపూర్‌ – డీపీవో పి.నరేశ్‌, మల్యాల – డీఏవో పి. సురేశ్‌, మెడిపల్లి, భీమారం –డీసీవో ఎస్‌. రామనుజాచారి, మెట్‌పల్లి –ఆర్‌డీవో కోరుట్ల పి. వినోద్‌కుమార్‌, పెగడపెల్లి – ఏడీహెచ్‌ గోపాల క్రిష్ణ, రాయికల్‌ – ఏడీఎస్‌ఎల్‌ఆర్‌ ఆర్‌.వెంకట్‌రెడ్డి, సారంగపూర్‌ – జిల్లా ఆడిట్‌ అధికారి బి.సుజాత, వెల్గటూర్‌, ఎండపెల్లి – డీఐఈవో బి.నారాయణను నియమించారు.

వరుస చోరీలకు పాల్పడుతున్న నలుగురి అరెస్ట్‌

- మూడు బంగారు చైన్లు, ట్రాలీ ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌



నిందితులను అరెస్ట్‌ చూపుతున్న ఎస్పీ



స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

జగిత్యాల క్రైం: జిల్లాలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్‌ చేసినట్లు ఎస్పీ ఎగ్గడి భాస్కర్‌ తెలిపారు. శనివారం జిల్లా ట్రాఫిక్‌ శిక్షణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఇబ్రహీంపట్నం, జగిత్యాల, మల్లాపూర్‌, మల్యాల, కొండగట్టు ప్రాంతాల్లో పలు చోరీలు, మద్యం దుకాణాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలను పట్టుకునేందుకు పది బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని బస్టాండ్‌ వద్ద ఈనెల 17న ఓ వృద్ధురాలు మెడలోంచి బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన మండల కేంద్రానికి చెందిన గద్దమీది మునీందర్‌ను అరెస్ట్‌ చేసి బంగారం స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈనెల 16న జిల్లా కేంద్రంలోని మాతాశిశు కేంద్రం వద్ద మహిళ మెడలోంచి 1.5 గ్రాముల బంగారంతో పాటు, ద్విచక్రవాహనం, శుక్రవారం రాత్రి సాయిబాబా ఆలయం వద్ద రోడ్డుపై వెళ్తున్న లలిత అనే మహిళ మెడలోంచి 39 గ్రాముల బంగారు గొలుసు ఎత్తుకెళ్లిన మల్యాల మండలం నూకపల్లి అర్బన్‌హౌసింగ్‌ కాలనీకి చెందిన మహ్మద్‌ అఖిల్‌తో పాటు అదే గ్రామానికి చెందిన పోటె భీంరావును అరెస్ట్‌ చేసి బంగారం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 21న మెట్‌పల్లిలోని మహలక్ష్మి వైన్స్‌లో, మెట్‌పల్లి మండలం వేంపేట మహలక్ష్మి కిరాణంలో తాళం పగులగొట్టి చోరీ చేశారు. ఈనెల 22న మల్యాల మండలం ముత్యంపేట శివారులో ట్రాలీ గూడ్స్‌ ఆటోను దొంగలించి గ్రామ శివారులోని ఆలయంలో హుండీలో నగదును కాజేశారు. రాంపూర్‌ శివారులోని పెద్దమ్మ గుడి తాళం పగులగొట్టి దొంగతనానికి పాల్పడటంతో పాటు ఆరు దొంగతనాలకు పాల్పడిన మెట్‌పల్లి పట్టణం ఇందిరానగర్‌కు చెందిన బొల్లవేని మహేశ్‌, సోదరుడు బొల్లవేని రాజేశ్‌పై కేసు నమోదు చేశారు. వారినుంచి ఆటోను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. దొంగతనాలకు పాల్పడిన వారిపై త్వరలోనే రౌడీషీట్‌ తెరుస్తానమన్నారు. ఈ సందర్భంగా టౌన్‌ సీఐ కిశోర్‌, మల్యాల సీఐ రమణమూర్తి, మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణతో పాటు మల్యాల ఎస్సై చిరంజీవి, మెట్‌పల్లి శ్యామ్‌రాజ్‌, ఇబ్రహీంపట్నం ఎస్సై ఉమాసాగర్‌, ఇబ్రహీంపట్నం ఏఎస్సై రాములు, మెట్‌పల్లి కానిస్టేబుల్‌ తిరుపతిని అభినందించారు. డీఎస్పీ రవీందర్‌ రెడ్డి, సీఐలు కిశోర్‌, రమణమూర్తి, లక్ష్మీ నారాయణ, ఎస్సైలు పాల్గొన్నారు.

చోరీపై స్పష్టత కరువు

- కొండగట్టులో చోరీకి గురైన వెండిపై విచారణ

కొండగట్టు (చొప్పదండి): కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో దొంగతనం జరిగి నెలరోజులు గడుస్తున్నా నేటికీ వెండిపై స్పష్టత రాలేదని విమర్శలున్నాయి. శనివారం హైదరాబాద్‌ దేవాదాయ అసిస్టెంట్‌ కమిషనర్‌ జ్యోతి జ్యూవెలరీ వెరిఫికెషన్‌ అధికారి అంజనీదేవి ఆలయానికి వచ్చారు. స్వామివారి గర్భాలయం అంతరాలయం లోపల చోరీకి గురై తీరు మిగిలిన వెండిని పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. చోరీలో 33 కిలోల 100 గ్రాముల వెండిని ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పూర్తి వివరాలు ఈవోను అడిగితే తెలుపకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత అధికారులు లెక్కలు చెప్పలేని స్థితిలో ఉన్నారు. ట్రాన్స్‌ఫర్‌పై వెళ్లిన సూపరింటెండెంట్‌ శ్రీనివాస శర్మతో ప్రతిసారి లెక్కలు చెప్పిస్తున్నారు. ఈవో 15కిలోలు చోరీకి గురైనట్లు ఫిర్యాదు ఇస్తే పోలీసులు 17 కిలోలు పట్టుకున్నారు. ఇటీవలే దేవాదాయ కమిషనర్‌ ప్రస్తుత అధికారులు మాత్రం 33 కిలోలు పోయినట్లు తెలుపుతున్నారు. త్వరలోనే ఈవో 33కిలోలు పోయినట్లు ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం, ఎంత వెండి పోయిందో హైదరాబాద్‌ నుండి అధికారులు వచ్చే వరకు తెలియని పరిస్థితి.

అంజన్న ఆలయంలో సినీ దర్శకుడి పూజలు

కొండగట్టు (చొప్పదండి) : కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి వారిని రాజ్‌కహని సినిమా దర్శకుడు కార్తీకేన్‌ రాజు శనివారం దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆయన మాట్లడుతూ.. అంజన్న దయతోనే సినిమా పెద్ద విజయం సాధించిందని, త్వరలోనే మరో సినిమా తీస్తామన్నారు. ఇందులో కొండగట్టు ఆలయ ప్రాంత పరసరాలు సైతం చూపెడుతమని తెలిపారు. ఆయన వెంట సినిమా నిర్మాత ధార్మకస్‌ రాజు, కొరియో గ్రాఫర్‌ భాస్కర రాజు, మాజీ ఆలయ డైరెక్టర్‌ ఓల్లాల లింగగౌడ్‌ సినీనటులు మొగిలిపాలెం రమేశ్‌, తదితరులున్నారు.

టేకు కలప పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు కలప

సారంగాపూర్‌: మండలంలోని సారంగాపూర్‌–బట్టపల్లి గ్రామాల మధ్య నిల్వ ఉంచిన టేకు కలపను అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దొల్లుగుండు శివారులోని అటవీప్రాంతంలో 6 టేకు దుంగలను నరికి తరలించేందుకు పొలాల సమీపంలో నిల్వ ఉంచారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా కలపను స్వాధీనం చేసుకొని సారంగాపూర్‌ బీట్‌ అధికారి కార్యాలయానికి తరలించారు. సెక్షన్‌ అధికారి మహేశ్‌, బీట్‌ అధికారులు గోపాల్‌; రవీందర్‌ తదితరులున్నారు.

వేముల ప్రభాకర్‌కు కీర్తి పురస్కారం

రాయికల్‌: పట్టణానికి చెందిన ప్రముఖ కవి రచయిత వేముల ప్రభాకర్‌కు పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం ప్రకటించింది. వేముల ప్రభాకర్‌ ×వరకవి భూమాగౌడు॥ నవల రచనకు గాను కీర్తి పురస్కారం ప్రకటించగా ఈనెల 28న అందుకోనున్నారు. ఇప్పటివరకు మూడు నవలలు, ఒక కథ సంపుటి, ఆరు కవిత సంపుటిలు, స్వీయరచనతో పాటు రెండు సాహితీ గ్రంథాలు, ఒక మాసపత్రిక వారి సంపాదకత్వంలో వెలువడ్డాయి. ఈ సందర్భంగా వేముల ప్రభాకర్‌ను సాహితీవేత్తలు, విద్యావేత్తలు, రచయితలు అభినందించారు.

కొనసాగుతున్న గీతాపఠన శిక్షణ తరగతులు

జగిత్యాల టౌన్‌ : పట్టణంలోని ఆధ్యాత్మిక కేంద్రం గీతా భవన్‌లో గీతా పఠన శిక్షణ తరగతులు శనివారం కొనసాగాయి. 8వ రోజు దైవాసుర సంపద్‌ విభాగ యోగంలోని ఘట్టాలను గీతా సత్సంగ్‌ అధ్యక్షుడు చీలమంతుల చత్రపతి గురూజీ వివరించారు. కార్యక్రమంలో పట్టణంలోని అన్ని సత్సంగాల సభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్‌ మండలం చల్‌గల్‌ గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద బొలేరో వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో శనిగారపు రమేశ్‌ విద్యార్థికి తీవ్రగాయాలయ్యాయి. మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన శనిగారపు రమేశ్‌ ఇంటర్‌ పరీక్ష రాసి స్వగ్రామం వెళ్తుండగా చల్‌గల్‌ బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. దీంతో రమేశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అదే సమయంలో ద్విచక్రవాహనంపై వస్తున్న మరో వ్యక్తి కిందపడిపోయిన ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అతనికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా జగిత్యాల ఆస్పత్రికి తరలించారు.

గ్రూప్‌–1 పరీక్షకు ఉచిత శిక్షణ

జగిత్యాల: బీసీ స్టడీ సర్కిల్‌ కరీంనగర్‌ ద్వారా గ్రూప్‌–1 పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సాయిబాబా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అభ్యర్థులు నేరుగా బీసీ స్టడీ సర్కిల్‌ కరీంనగర్‌లో ఈనెల 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. అభ్యర్థులు ఎసెస్సీ, ఇంటర్‌, డిగ్రీలో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. మరిన్ని వివరాల కోసం 0878–2268686 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మద్యం దుకాణంలో చోరీకి యత్నం

- సీసీ ఫుటేజీలను విడుదల చేసిన పోలీసులు

మల్యాల : మండలంలోని ముత్యంపేట దిగువ కొండగట్టులోని రెండు మద్యం దుకాణాల్లో శుక్రవారం రాత్రి ఇద్దరు చోరీకి యత్నించగా సీసీ ఫుటేజీని పోలీసులు విడుదల చేశారు. చోరీకి యత్నించిన వారి సమాచారం ఇస్తే వారికి పారితోషికం ఇస్తామని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని మల్యాల ఎస్సై మంద చిరంజీవి తెలిపారు. సమాచారం అందించేవారు సీఐ రమణ మూర్తి 8712656818, ఎస్సై చిరంజీవి 8712656830 నెంబర్లలో సంప్రదించాలన్నారు.